ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 14 సెప్టెంబరు 2025




కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

అమ్మో.. సిటీ ప్లానింగ్..!

- కడపకు వచ్చేందుకు ఆసక్తి చూపని అధికారులు
- ఉన్న అధికారులే సెలవుపై వెళ్లే యత్నం
- ఎల్ఆర్ఎస్‌తో రూ.20కోట్ల మేర ఖజానాకు చేకూరనున్న ఆదాయం
- లేఅవుట్‌దారుల్లో అవగాహన కల్పించడంలో విఫలం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప.. కార్పొరేషన్ మాత్రమే కాదు.. జిల్లా కేంద్రం కూడా. జిల్లాలోనే ఇది కీలకమైన నగరం. కార్పొరేషన్‌లో వాణిజ్య, నివాస భవనాలు నిర్మించుకోవాలన్నా, నిబంధనల మేరకు అనుమతి తీసుకుని లేఅవుట్ వేయాలన్నా సిటీప్లానింగ్ విభాగం కీలకం. కార్పొరేషన్ అభివృద్ధిలో ముఖ్యమైన సిటీ ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరత కనిపిస్తోంది. ఇక్కడ పనిచేస్తున్న అధికారులు బదిలీపై వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నట్లు చెబుతున్నారు. ఇక్కడికి బయటి నుంచి వచ్చేందుకు ఎవ్వరూ సుముఖంగా లేరని సమాచారం. కడప కార్పొరేషన్‌లోని సిటీప్లానింగ్ అంటేనే అధికారులు అమ్మో.. అంటున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకువచ్చిన అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) ముందుకు సాగడంలేదు. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించేందుకు నేడో, రేపో ప్రభుత్వం బీపీఎస్ (బిల్డింగ్ ప్లీనరైజేషన్ స్కీం) తీసుకురానుంది. ఈ రెండు స్కీంల ద్వారానే కార్పొరేషన్ ఖజానాకు సుమారు రూ.50 కోట్ల మేర ఆదాయం రావచ్చని అంచనా వేస్తున్నారు. అంత ఆదాయం రావాలంటే సిటీ ప్లానింగ్ అధికారులే కీలకం.

కడప కార్పొరేషన్‌లో సిటీప్లానర్‌గా శైలజ పనిచేస్తున్నారు. ఈమెకు కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (కుడా) అదనపు బాధ్యతలు కూడా అప్పగించారు. రెండు చోట్ల పనిచేసే పరిస్థితి. ఒక ఏసీపీపై అవినీతి ఆరోపణలు రావడంతో అతడిని పక్కన పెట్టారు. ఏసీపీ రెండు వారాలు సెలవులో వెళ్లారు. ప్రస్తుతం టౌన్‌ప్లానింగ్ ఆఫీసరు రాజు మాత్రమే పనిచేస్తున్నారు.

కదలని ఎల్ఆర్ఎస్

కడప కార్పొరేషన్‌లో సుమారు 125కు పైగా అనుమతి లేని లేఅవుట్లు ఉన్నాయి. జగన్ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి జనానికి అంటగట్టారు. వీటిని ఎల్ఆర్ఎస్ ద్వారా క్రమబద్ధీకరిస్తే రూ.20కోట్ల మేర కార్పొరేషన్‌కు ఆదాయం వస్తుంది. ఇలా జరగాలంటే సిటీప్లానింగ్ సిబ్బంది ఫీల్డ్‌పైకి వెళ్లి అనుమతి లేని లేఅవుట్ల యజమానులతో చర్చించి అవగాహన కల్పించాలి. అయితే ప్రస్తుతం ప్రధాన సెంటర్లలో ఎల్ఆర్ఎస్ స్కీంపై ఫ్లెక్సీలు పెట్టి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శఉంది. దీంతో ఎల్ఆర్ఎస్‌పై స్పందన కరువైందని చెబుతున్నారు.

త్వరలో బీపీఎస్

ఎల్ఆర్ఎస్ ద్వారా అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వం.. ఇక బిల్డింగ్ ప్లీనరైజేషన్ స్కీంకు అనుమతి ఇవ్వనుందని అధికార వర్గాలు తెలిపాయి. దీనివల్ల నిబంధనలు అతిక్రమించి నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరణ చేసుకోవచ్చు. కడప నగరంలో నిబంధనలకు విరుద్ధంగా కోకొల్లలుగా భవనాల నిర్మాణం సాగింది. కొందరు వైసీపీ పెద్దలు, అవినీతి అధికారుల వల్ల అడ్డగోలుగా నిర్మాణాలు సాగాయి. బీపీఎస్ వస్తే వాటిని క్రమబద్ధీకరించుకోవచ్చు. దీని ద్వారా కార్పొరేషన్‌కు రూ.30కోట్ల దాకా ఆదాయం వస్తుందని చెబుతున్నారు. అయితే బీపీఎస్ కు కూడా సిటీప్లానింగ్ సిబ్బందే గ్రౌండ్‌లోకి వెళ్లాలి. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఆసక్తి చూపని అధికారులు

కడపలో భిన్నమైన రాజకీయ పరిస్థితులున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి ఆర్.మాధవి ఉన్నారు. కార్పొరేషన్ పాలకవర్గం వైసీపీ చేతుల్లో ఉంది. కార్పొరేషనులో కుర్చీ కోసం ఎమ్మెల్యే మాధవి, మేయరు సురేశ్‌బాబు మధ్య మొదలైన ఆధిపత్య పోరు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇక్కడ టీడీపీ, వైసీపీ మధ్య బిగ్‌ఫైట్ నడుస్తుండడంతో కార్పొరేషన్‌లో పనిచేసేందుకు అధికారులు ఆసక్తి చూపడంలేదని చెబుతున్నారు. దీంతో ఇక్కడ ఉన్న సిబ్బందే బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ నడుస్తోంది. కలెక్టర్ కార్పొరేషన్‌పై దృష్టి పెట్టి సిటీప్లానింగ్‌ను బలోపేతం చేసేందుకు కడప అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీలో ఉన్న సిబ్బందినైనా డిప్యుటేషన్‌పై ఇక్కడకు తీసుకురావాలని చెబుతున్నారు. అలా చేస్తే ఎల్ఆర్ఎస్ ద్వారా అనుమతిలేని లేఅవుట్లు కూడా రెగ్యులర్ చేయవచ్చు. దీనివల్ల సుమారు రూ.20కోట్ల మేర ఆదాయం వస్తుంది. ఆ సొమ్ముతో కార్పొరేషన్‌లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, సాగునీరు ఇతర మౌలిక వసతులు మెరుగుపరచుకోవచ్చు.

కొత్త సార్లు వస్తున్నారు



- 19న నియామక పత్రాలు
- దసరా తర్వాత విధుల్లో చేరే అవకాశం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన కొత్త ఉపాధ్యాయుల జాబితా త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది. దసరా సెలవుల తర్వాత వారు విధుల్లో చేరనున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన వైఎస్సార్ కడప జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, పురపాలక (జిల్లాస్థాయి) విభాగంలో 705 పోస్టులు, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం (జిల్లా స్థాయి) విభాగంలో 4 పోస్టులు, జువైనల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 3 పోస్టులు.. మొత్తంగా జిల్లాస్థాయిలో 712 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇవి కాకుండా రాష్ట్రస్థాయిలో డిఫరెంట్ ఏబుల్డ్ పాఠశాలల్లో భర్తీ చేయనున్న 31 పోస్టులు, జోన్ 4 పరిధిలో జిల్లా కేటాయింపు ప్రకారం మరిన్ని పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది. వీటి భర్తీ కోసం ఉమ్మడి కడప జిల్లాలో ప్రకటించిన మెరిట్ లిస్ట్ నుంచి రిజర్వేషన్, నిబంధనలకు అనుగుణంగా గతనెల 26 నుంచి 28 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. పోస్టులకు ఎంపికైన వారి జాబితాను వారం రోజుల్లో ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 19వ తేదీన అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ఆర్డర్లు అందించే అవకాశముంది.

ఎస్పీగా షెల్కే నచికేత్

- అశోక్‌కుమార్ బదిలీ


కొత్త ఎస్పీ షెల్కే నచికేత్

కడప, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న ఈజీ అశోక్‌కుమార్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. కొత్త ఎస్పీగా మహారాష్ట్రకు చెందిన షెల్కే నచికేత్‌ను నియమించారు. మహారాష్ట్రలోని పూణెకి చెందిన చంద్రసేన, విశ్వనాథ్‌ల పెద్దకుమారుడు నచికేత్ 2019 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఎలక్ట్రానిక్ అండ్ టెలిక మ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పొందారు. ఎలాంటి కోచింగ్‌కు వెళ్లకుండానే యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో 167వ ర్యాంకు సాధించారు. విజిలెన్స్ ఎస్పీగా ఉన్న నచికేత్ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనలో బందోబస్తును పర్యవేక్షించేవారు. ఇప్పుడు జిల్లాకు ఎస్పీగా వస్తున్నారు.

ఎనిమిది నెలలకే ఎస్పీ బదిలీ

ప్రస్తుతం బదిలీ అయిన ఈజీ అశోక్‌కుమార్ ఈ ఏడాది జనవరి 24న బాధ్యతలు చేపట్టారు. వీరు ఎస్పీగా వచ్చాక జూదంపై ఉక్కుపాదం మోపారు. వైసీపీ హయాంలో జిల్లాలో ఇష్టారాజ్యంగా జూదం నిర్వహించారు. కూటమి వచ్చాక కూడా కొనసాగింది. కొందరు పోలీసుల సహకారంతో జూదగృహాలను తెరిచి ఇష్టారాజ్యంగా ఆడించారు. అశోక్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తరువాత జూదగృహాలపై కఠినంగా వ్యవహరించారు. దీనిని కొందరు కూటమి నేతలు జీర్ణించుకోలేక పోయారు. నాలుగురోజుల క్రితం గండికోటలో గ్యాంబ్లింగ్ నిర్వహిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇది కూడా కొందరు కూటమి నేతలకు మింగుడు పడలేదు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్‌కు కూడా అశోక్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎనిమిది నెలలకే అశోక్‌కుమార్ బదిలీ కావడం గమనార్హం.

మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి

- 17 నుంచి 2 వరకు స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే సమాజం బాగుంటుందని.. మహిళల ఆరోగ్యంపట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలోని తన చాంబరులో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పుట్టిన ఆడశిశువు మొదలు మహిళలందరి ఆరోగ్య సంరక్షణకు కేంద్రం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ నెల 17వ తేదీన ఇండోర్‌లో దేశ ప్రధాని మోదీ స్వస్థ్ నారీ సశక్త్ పరియార్ అభియాన్ అనే పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. జిల్లాలోనూ అదేరోజు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో భాగంగా 17వ తేదీ నుంచి అక్టోబరు 2వరకు జిల్లా వ్యాప్తంగా 474 వైద్య క్యాంపుల ద్వారా మహిళల ఆరోగ్య సమస్యలపై స్పెషలిస్ట్ డాక్టర్లతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డీఎల్ఏటీఓ డాక్టర్ రవిబాబు, ఆర్బీఎస్‌కే డాక్టర్ రమేష్, జిల్లా మలేరియా అధికారిణి మనోరమ, డెమో భారతి, డిప్యూటీ హెచ్ఈఓ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు ప్రచార రథం

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు జిల్లాలో ఆ వ్యాధులను పూర్తి స్థాయిలో అదుపులోకి తెచ్చేందుకు ప్రచారం రథం పర్యటిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఆవరణంలో జిల్లా వైద్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని డీఎంహెచ్ఓ ప్రారంభించారు.

లోక్‌అదాలత్‌లో 14,005 కేసుల పరిష్కారం

- రూ.9,94,86,943 చెల్లింపు
- జిల్లా ప్రధాన జడ్జి యామిని


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో 14,005 కేసులను పరిష్కరించి రూ.9,94,86,943లు చెల్లించామని డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో నేషనల్ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. దీనికి సంబంధించి వివరాలను జడ్జి వెల్లడించారు. లోక్ అదాలత్‌కు వచ్చిన కేసుల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా 23 బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో జిల్లా కోర్టులో 4, ప్రొద్దుటూరు కోర్టులో 3, రాజంపేట కోర్టులో 3, రాయచోటి కోర్టులలో 3, బద్వేల్ కోర్టులో 2, లక్కిరెడ్డిపల్లె, రైల్వేకోడూరు, సిద్దవటం, నందలూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం కోర్టులలో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఒకసారి కేసు పరిష్కారం అయితే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమన్నారు. తిరిగి అప్పీల్‌కు వెళ్లడానికి వీలు పడదన్నారు. పైగా అధిక్రమ, ఖర్చుతో కూడిన పని ఉండదన్నారు. లోక్‌అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు. దీర్ఘకాలిక కేసులకు కూడా లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా చక్కటి పరిష్కారం దొరుకుతుందన్నారు. లోక్ అదాలత్ నిర్వహణలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, ఆయా కోర్టుల జడ్జిలు, న్యాయవాదులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గండికోటకు న్యూ డెస్టినేషన్ అవార్డు

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటకు మోస్ట్ ప్రామిసింగ్ న్యూ డెస్టినేషన్ అవార్డు దక్కింది. సెప్టెంబరు 11 నుంచి 13 వరకు న్యూఢిల్లీలోని యశోభూమిలో ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఐఐసీసీ)లో జరిగిన బిజినెస్ లేజర్ ట్రావెల్ అండ్ మైస్ ఎగ్జిబిషన్-2025లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం సత్తా చాటింది. భారతదేశపు గ్రాండ్ కేనియన్‌గా గుర్తింపు పొందిన గండికోటకు మోస్ట్ ప్రామిసింగ్ న్యూ డెస్టినేషన్ అవార్డు లభించింది. ఈ అవార్డును ఏపీ టూరిజం అథారిటీకి చెందిన చీఫ్ మార్కెటింగ్ అధికారిణి, కమ్యూనికేషన్ ఆఫీసర్ పద్మారాణి శనివారం అందుకున్నారు.

బత్తాయి ధర.. 7
పతనం
- నష్టాల బాటలో చీనీ రైతులు

ఒక్క భవనమూ పూర్తికాలేదు

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి


పులివెందులలో పూర్తికాని మెడికల్ కళాశాలను పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పులివెందుల మెడికల్ కళాశాలకు సంబంధించి ఒక్క భవనం కూడా పూర్తి కాలేదని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల భవనాలను ఎమ్మెల్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల మెడికల్ కళాశాల పూర్తయినా వినియోగంలోకి తేలేదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారన్నారు. మెడికల్ కళాశాలకు సంబంధించి పరిపాలన భవనం, కళాశాల, ఫ్యాకల్టీ క్వార్టర్స్, విద్యార్థుల హాస్టల్ భవనాలు పూర్తికాలేదన్నారు. కేవలం ఆసుపత్రికి సంబంధించి రెండు భవనాలు పూర్తిచేసి రంగులు వేసి మా ప్రభుత్వంలోనే పూర్తిచేశాం, ప్రారంభించామని జగన్ గొప్పలు చెప్పుకొంటున్నారన్నారు. ఆసుపత్రి భవనాలకు, మెడికల్ కళాశాలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. పీపీపీ విధానం అంటే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సాగుతుందన్నారు. మెడికల్ కళాశాలకు సంబంధించి సీట్లు మాత్రమే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఉంటాయి తప్ప ఆసుపత్రికి సంబంధించి రోగులకు వైద్యం అందించే విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జా మైసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మృతిచెందిన రైతు సంజీవరెడ్డి

మైలవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతరాయునిపేటకు చెందిన సిద్దంరెడ్డి సంజీవరెడ్డి (36) అనే రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడని తలమంచిపట్నం హెడ్‌కానిస్టేబుల్ బ్రహ్మయ్య శనివారం తెలిపారు. సంజీవరెడ్డికి దాదాపు 10 ఎకరాల పొలం ఉందని, రెండు మూడు సంవత్సరాలుగా సరైన పంటలు పండక దాదాపు రూ.15 లక్షలకు పైగా అప్పు చేశాడని అన్నారు. అప్పులు తీరే మార్గం లేక మనస్థాపం చెంది ఇంటి వెనుకే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖరీఫ్ సాగు.. 34 శాతమే

- బీడు భూములుగా 51 వేల హెక్టార్లు
- 1 నుంచి రబీ ప్రారంభం

ప్రధాన పంటల సాగు హెక్టార్లలో..

పంట	లక్ష్యం	సాగు
వరి	30,804	14,296.44
పత్తి	24,036	4333.47
వేరుశనగ	5,976	1168.89
మినుము	3806	1765.2
కంది	5761	1295.08
మొక్కజొన్న	932	2453.15
సజ్జ	1089	813




ఖరీఫ్‌లో అదునుకు వానలు పడకపోవడంతో పెండ్లిమర్రి మండలంలో సాగుకు నోచుకోని భూములు

కడప రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు ఈ ఏడాది ఖరీఫ్ అచ్చిరాలేదు. కోటి ఆశలతో జూన్ 1వ తేదీన ఖరీఫ్ ప్రారంభమైంది. ఈ నెల 30వ తేదీతో ఖరీఫ్ సీజన్ ముగియనుంది. సీజన్ పూర్తి కావస్తున్నా కేవలం 34 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 77,475 హెక్టార్లు సాగు లక్ష్యంగా అధికారులు భావించారు. ఇందుకు తగ్గట్టుగా ముందస్తు వర్షాలు మురిపించాయి. ఈ వర్షాలకు 10 శాతం వరకు పంటలు సాగుకు నోచుకున్నాయి. ఆ తరువాత వర్షాలు ఉసూరుమన్నాయి. నైరుతి రుతుపవనాలు నై నై అనడంతో జూన్ నెలలో 68.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 21.6 మాత్రమే నమోదైంది. అలాగే జూలైలో 96.7 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 48 శాతం మాత్రమే నమోదైంది. జూన్ 10 నుంచి జూలై 20 వరకు వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. ఆ తరువాత ఒకటి రెండు తుఫానులు, అల్పపీడనాలు వచ్చినా జిల్లాలోని మెట్ట ప్రాంత రైతాంగానికి పెద్దగా ఉపయోగపడలేదు. కానీ పై ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా జిల్లాలోని ప్రాజెక్టులకు నీరు రావడం, పెన్నా నది ప్రవహించడం, కేసీ కెనాల్‌కు నీరు చేరడంతో అతి కష్టం మీద కేవలం 26,835.54 హెక్టార్లలో అంటే 34 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇంకా 51,000 హెక్టార్లకు పైగా బీడు భూములుగానే దర్శనమిస్తున్నాయి. 17 రోజుల్లో ఖరీఫ్ సీజన్ పూర్తి కానుండడంతో రైతుల్లో నిరాశ, నిస్పృహలు అలుముకున్నాయి.

ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలను వర్షాభావ పరిస్థితులు వెంటాడాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఏ దశలోను మెట్టసాగుకు అవసరమైన వర్షాలు పడలేదు. ప్రతి రోజు ఆకాశం మేఘావృతమై వర్షాలు పడేలా కారుమబ్బులు కమ్ముకొస్తున్నా.. వరుణ దేవుడు కరుణించకుండా చుట్టం చూపులాగా ఇలా వచ్చి అలా వెళ్లిపోయాడు. అదునుకు వాన పడకపోవడంతో ఖరీఫ్‌లో కేవలం 34 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. ఇక ఖరీఫ్ 17 రోజులతో ముగియనుంది. మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు రబీపై ఆశలు పెట్టుకున్నారు.

అక్టోబరు నుంచి రబీ సీజన్ ప్రారంభం

అక్టోబరు నుంచి జిల్లాలో రబీ సీజన్ ప్రారంభం కానుంది. ఇందుకు కేవలం 17 రోజులు మాత్రమే ఉంది. ఖరీఫ్‌లో సాగుకు నోచుకోకుండా ఉన్న బీడు భూములను రబీలో సాగులోకి తెచ్చేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు.

పాఠశాల కరస్పాండెంట్‌పై పోక్సో కేసు 7

రైలులో నుంచి పడి మహిళకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహిళ

వాల్మీకిపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి కింద పడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం ఉదయం వాల్మీకిపురం రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకున్న సంఘటన వివరాల్లోకెళితే... సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్తున్న సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్ రైలు వాల్మీకిపురం రైల్వే స్టేషన్ దాటుతుండగా స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఓ మహిళ రైలు నుంచి కిందికి పడి గాయాలపాలయ్యారు. ఉదయం 6.30 గంటలకు ఆ ప్రాంతంలో పాదచారులు గమనించి స్థానిక రైల్వే స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు. మహిళను వివరాలు ఆరా తీయగా తనది ముదిగుబ్బ ప్రాంతం కురాండ్లపల్లె తండా అని, తనపేరు చెన్నమ్మ బాయ్ తన భర్తపేరు శంకర్‌నాయక్ అని తెలియజేయడం గమనార్హం. గాయపడ్డ మహిళను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించడంలో స్థానికులు సహాయక చర్యలు అందించారు. తలకు గాయమైన చెన్నమ్మబాయ్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళ్లిపోయింది. పాదచారులు గమనించడంతో చెన్నమ్మబాయ్ తనను తన కుమారుడే రైలు నుంచి కిందికి తోసినట్లు తెలిపింది.

ఉమ్మడి జిల్లా జట్టుకు మదనపల్లె క్రీడాకారిణి



టెన్నిస్ క్రీడాకారిణి ప్రణీత

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె క్రీడాకారిణి ఉమ్మడి చిత్తూరు జిల్లా టెన్నిస్ జట్టుకు ఎంపికైనట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిశోర్ కుమార్ తెలిపారు. శనివారం తిరుపతిలో టెన్నిస్ అకాడమిలో అండర్-14 బాలబాలికల లాన్‌టెన్నిస్ కోర్టులో నిర్వహించిన సెలెక్షన్స్‌లో ప్రతిభ చూపిన మదనపల్లె వాసి బి.శ్రీధర్‌రెడ్డి కుమార్తె ప్రణీతరెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైందన్నారు. ఈమె వచ్చేనెల విశాఖపట్నం లేదా విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు తరపున పాల్గొంటుందన్నారు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు ప్రణీతను అభినందించారు.

హార్టికల్చర్ పీహెచ్‌డీ ఎంట్రెన్స్‌లో నవీన్‌కు ఆల్ ఇండియా మొదటి ర్యాంకు



ఏనుగుల నవీన్

రామాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన హార్టికల్చర్ పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లో మండలంలోని కసిరెడ్డిగారి పల్లెకు చెందని ఏనుగుల నవీన్ ఆల్ ఇండియా మొదటి ర్యాంకు సాధించాడు. ఈయన మడకశిరలో హార్టీకల్చర్ డిప్లొమా, బీఎస్సీ, ఎంఎస్సీ హార్టికల్చర్ అనంతరాజుపేటలోని ఉద్యాన కళాశాలలో చదివారు. ఈ విద్యార్థి తల్లి ఏనుగుల ఉమాదేవి అంగన్వాడీ టీచర్, తండ్రి అనారోగ్యంతో 2022లో మృతి చెందాడు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, సైన్సు సబ్జెక్టుల్లో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే ఈనెల 23వ తేదీ లోపు నవోదయ విద్యాలయానికి నేరుగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జవహర్ నవోదయలో సంప్రదించాలని తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పుల్లంపేట విద్యార్థులు



తైక్వాండోకు ఎంపికైన రిషిత్‌వర్మ, కార్తీక   స్కేటింగ్‌కు మనోజ్ఞ

పుల్లంపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. రైల్వేకోడూరులో శనివారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 తైక్వాండతో బాలుర విభాగంలో ఆదర్శ పాఠశాల విద్యార్థి రిషిత్‌వర్మ, బాలికల విభాగంలో కార్తిక, అండర్-19 స్కేటింగ్ విభాగంలో ఆదర్శ పాఠశాలకు చెందిన మనోజ్ఞరాజ్ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ లీలాశ్రీహరి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చంద్రమోహన్‌రాజు విద్యార్థులను, పీడీ నీలకంఠరావును అభినందించారు.

ప్రసన్న వెంకన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటరమణ స్వామి

తంబళ్లపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రమేష్ స్వామి తెల్లవారుజామునే స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలతో నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం వేంకటరమణ స్వామికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంబళ్లపల్లె సివిల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్, అర్చకులు రమేష్ స్వామి, సిబ్బంది నగేష్‌లు న్యాయాధికారికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

బొప్పాయి ధర కిలో రూ.8

- సెకండ్ గ్రేడ్ ధర కిలో రూ. 7
- నిర్ణయించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్

రైల్వేకోడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి మొదటి రకం ఎగుమతి ధర కిలో రూ.8, సెకెండ్ గ్రేడ్ ధర కిలో రూ.7గా నిర్ణయించినట్లు శనివారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ట్రేడర్లు తక్కువ ధరకు అమ్మితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తక్కువ ధరకు రైతు నుంచి తీసుకుంటున్నారని రైతులు ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బొప్పాయి రైతులు 95739 90331, 90303 15951 అనే ఫోన్ నెంబర్లకు ఫిర్యాదు చేస్తే తప్పక స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఒట్టిపోయాయి...



నారాయణరెడ్డిపల్లె గ్రామంలో చుక్కనీరు లేని రింగప్పకుంట



శెట్టిపల్లె గ్రామం గాండ్లపల్లె వద్ద బీడుగా ఉన్న భూములు

- రాయచోటిని కబళిస్తున్న కరువు
- ఖరీఫ్‌లో 44 శాతం లోటు వర్షపాతం
- 18 శాతం మాత్రమే సాగైన పంటలు
- ఎండుతున్న వేరుశనగ, నిండని చెరువులు, కుంటలు
- ఈ ఏడాదీ కరువే



గుట్టపల్లి వద్ద బిందెడు నీటి కోసం కుస్తీపడుతున్న జనం

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో రైతులను కరువు పరిస్థితులు కబళిస్తున్నాయి. బావులు, వంకలు, చెరువులు, వాగులు చుక్కనీరు లేక ఒట్టిపోయాయి. గత రెండు, మూడు సంవత్సరాలుగా కరువు పరిస్థితులను అనుభవించిన రైతులు ఈ ఏడాది గంపెడాశతో ఖరీఫ్ పంట సాగుకు ఎదురుచూశారు. వర్షాలు సకాలంలో పడకపోవడంతో భూములు సాగుకు నోచుకోక ఈ ఏడాది కరువు పరిస్థితులే కనిపిస్తున్నాయి. అడుగంటిన భూగర్భజలం రోజురోజుకు ఒట్టిపోతున్న బోర్లు, వర్షాధారంపై ఆధారపడి పంట సాగు చేపట్టేందుకు ముందుకురాని రైతులు, చుక్క నీరు లేని చెరువులు, కుంటలు ఎండిపోతున్న చెట్లు, వర్షాకాలంలో కూడా భగ్గుమంటున్న ఎండలు, ఇలా కరువు పరిస్థితులు రైతులను వెటాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో జూన్ నుంచి సెప్టెంబరు వరకు 44 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో ఖరీఫ్‌లో జిల్లాలో 57 వేల హెక్టార్లలో సాగు కావాల్సి ఉండగా 10,600 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. దీంతో 18 శాతానికి సాగు పడిపోయింది.

రాయచోటి నియోజక వర్గంలో రాయచోటి, సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో కరువు తాండవిస్తోంది. పల్లెల్లో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గుక్కెడు బిందె నీళ్ల కోసం గంటల తరబడి నిరీక్షణ చేయాల్సి పరిస్థితి ఏర్పడింది. రాయచోటి మండలం మాధవరం గ్రామం రెడ్డివారిపల్లె ప్రాంతంలో రైతులు ఖరీఫ్‌లో వర్షాధారం కింద వేరుశనగ పంట సాగు చేశారు. వర్షాలు పడకపోవడంతో వేరుశనగ ఎండు ముఖం పట్టింది. కళ్ల ముందు ఎండిపోతున్న కట్టెను చూసి కన్నీరు పెట్టడం తప్ప ప్రయోజనం కనిపించడం లేదు. గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో వెలిగల్లు కాలువ పరీవాహక ప్రాంతాల్లో తప్ప మిగిలిన చోట్ల ఇదే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు.

వరుసగా నష్టాలే



వర్షాలపై ఆధారపడి వేరుశనగ పంట సాగు చేస్తూ ప్రతి సంవత్సరం నష్టాలు తప్ప లాభం లేదు. ఏదో ఒక దశలో నష్టపోతున్నాం తప్ప ప్రయోజనం లేదు. వరుగా కరువు పరిస్థితులే. పెట్టుబడులు పెట్టడం, నష్టపోవడం పంట సాగు చేయాలంటే భయమేస్తోంది. నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- కుంచపు సుబ్బయ్య, శెట్టిపల్లి

వర్షాలకు నిండని చెరువులు, కుంటలు

వర్షాకాలం వస్తే చాలు ఒకప్పుడు వంకలు రెండు, మూడు నెలల పాటు నీటి నిల్వలతో నీరు ప్రవహిస్తూ ఉండేవి. నీటి కప్పల శబ్దాలతో చెరువులు, కుంటల్లో సంగీతం వినిపించేది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదు. వర్షాలు అంతంత మాత్రమే పడుతున్నాయి. దీంతో వ్యవసాయ బావులు ఒట్టిపోయాయి. బోరుబావులు బొట్టు రాలుస్తున్నాయి. రాయచోటి నియోజకవర్గంలో 1000కి లోపు కుంటలు, చెరువులు ఉంటాయి. ఎక్కడా నీరు కనిపించడం లేదు. మైదానాన్ని తలపిస్తున్నాయి. చెరువుల కింద ఆయకట్టు భూములు సాగుకు నోచుకోవడం లేదు. ఇలానే పరిస్థితులు కొనసాగితే రైతుల మనుగడ కష్టతరమే.

చెరువుల్లోకి నీరు రాలేదు



రాష్ట్రంలో కోస్తా జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలో వరదలతో రైతులు నష్టపోతున్నారు. రాయలసీమ జిల్లాల్లో వర్షాల ప్రభావం పెద్దగా కనిపించలేదు. చెరువుల్లోకి నీరు రాలేదు. శెట్టిపల్లి పెద్దచెరువు లాలా చెరువు చిన్నచెరువు ఇవి నిండి రెండేళ్లు అవుతోంది. ఈసారి నిండేటట్టు కనబడడం లేదు. వరుసగా కరువు తప్ప రైతులకు ప్రయోజనం లేదు. చెరువులు నిండితే తప్ప ప్రయోజనం లేదు. కరువు మండలాలు ప్రకటిస్తున్నారు తప్ప రైతులకు కరువు నుంచి ఉపశమనం కల్పించడం లేదనే చెప్పవచ్చు.

- కె.రవీంద్రారెడ్డి, శెట్టిపల్లె పెద్దచెరువు, నీటి సంఘం అధ్యక్షుడు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా నుంచి రెండు జట్లు





రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు, రాష్ట్ర స్థాయికి ఎంపికైన బాలికల జట్టు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ హైస్కూలు మైదానం లో శనివారం అన్నమయ్య జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యం లో 51వ అండర్-19 జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కడప జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం. చంద్రమోహన్‌రాజు, జిల్లా కబడ్డీ అధ్యక్షులు వి. హరినాథ్, కార్యదర్శి పి. అరుణ మాట్లాడుతూ జిల్లా నుంచి బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికలు పారదర్శకంగా జరిగాయని తెలిపారు. జిల్లా నలుమూల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఈ జట్లు ఈ నెల 22 నుంచి 25 వరకు విజయవాడలోని గొల్లపూడిలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.క్రీడాకారులు విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏపీ కోచ్ ఆర్వీ శ్రీధర్, అసోసియేట్ కార్యదర్శి ఎస్. పూజ, కృష్ణారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీవాణి, పీఈటీ పుల్లారావు, స్థానిక ఫిజికల్ డైరెక్టర్, వ్యాయామ ఉపాధ్యాయులు సుదర్శన్, నాగేంద్ర, భాస్కర్, అంజలి, సురేంద్ర, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 1601 కేసులు పరిష్కారం

- జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్



లోక్‌అదాలత్‌లో పాల్గొన్న జడ్జి ప్రవీణ్‌కుమార్, న్యాయవాదులు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల న్యాయ సేవా ఆధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాజంపేటలో జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసి 1601 కేసులను పరిష్కరించినట్లు మూడవ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మొత్తం కేసులను పరిష్కరించగా కక్షిదారులకు 61,79,430 రూపాయలు చెల్లించే విధంగా అవార్డులను జారీ చేసినట్లు తెలిపారు. జేఎఫ్‌సీఎం కోర్టులో 1590 క్రిమినల్ కేసులు, 2 సివిల్ కేసులు పరిష్కరించారు. ప్రమాదాలకు సంబంధించిన కేసులను 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో పరిష్కరించగా, పీఎల్‌సీ కేసులను కూడా పరిష్కరించడం జరిగిందన్నారు. చాలాకాలం పెండింగ్‌లో ఉన్న కుటుంబ సభ్యుల భూసమస్యలను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతనాయుడు, ఏపీపీ రామకృష్ణ, ఏజీపీ మౌనిక, న్యాయవాదులు నాగేశ్వరరావు, చౌదరి, శ్రీనివాసులు, రమణ, మౌలానా, భరత్‌రెడ్డి, కాశీ విశ్వనాథ్, తౌఫిక్, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేద పాఠశాలలో స్వల్ప అపశ్రుతి

- కడప జిల్లా వాసుల అత్యుత్సాహం
- సయోధ్యకు పెద్దల యత్నం



పాఠశాల ఆవరణలో పర్యటిస్తున్న చల్లపల్లి నరసింహారెడ్డి

బి.కొత్తకోట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని గట్టు పంచాయతీ గట్లపై కేంద్రంగా నిర్వహిస్తున్న ఓ వేద, సంస్కృత పాఠశాలలో ఓ అపశ్రుతి చోటుచేసుకుంది. వ్యాపారంగా మారిన ప్రస్తుత విద్యా విధానంలా కాకుండా భారతదేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, విద్యార్థుల మానసిక ఉత్సాహం దిశగా పయనింపజేయడమే లక్ష్యంగా ఈ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన అనూహ్య ఘటనలో ఓ విద్యార్థి కంటికి తీవ్రగాయమైంది. గాయపడిన బాలుడు కడప జిల్లాకు చెందిన వాడు కాగా, గాయం చేసినట్టు చెబుతున్న బాలుడు గట్టు పంచాయతీ వాసిగా తెలుస్తోంది. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థి తరఫు వ్యక్తులు పాఠశాలకు వచ్చి రభస సృష్టించడం, పెద్దమొత్తంలో నగదు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం అందుకున్న బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి శనివారం సంబంధిత పాఠశాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో అనుకోకుండా జరిగిన ఘటనలో యాజమాన్యం, ఆచార్యుల ప్రమేయం ఏమీ లేదన్నారు. కేవలం సేవా దృక్పథంతో నడుస్తున్న వేద పాఠశాలలో ఇలాంటి సంఘటన దురదృష్టకరమని గాయపడిన బాలుడికి తగిన న్యాయం జరిగేలా చూడాలని సూచించడంతో పాటు, యాజమాన్యానికి నైతిక మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

విజయదశమి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా, ఘనంగా నిర్వహించాలని బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి తెలిపారు. పట్టణంలో దసరా ఉత్సవాలను ఈ ఏడాది దుర్గామాత ప్రతిమను ప్రతిష్ఠించి ఘనంగా నిర్వహించాలని పట్టణంలోని కొందరు యువకులు సంకల్పించారు. అందులో భాగంగా జ్యోతిసర్కిల్‌లో ఓ స్థలాన్ని ఎంచుకుని దాని పరిశీలన కోసం బీజేపీ నేత చల్లపల్లిని ఆహ్వానించారు. ఈ మేరకు చల్లపల్లి శనివారం బి.కొత్తకోటకు చేరుకుని ఆ స్థలాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య రాకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా దుర్గామాత ప్రతిమను ప్రతిష్ఠించి దసరా వేడుకలు నిర్వహించుకుందామని నిర్వాహక కమిటీ సభ్యులకు సూచించారు. విగ్రహ ప్రతిష్ఠకు అనుమతులను సంబంధిత అధికారుల నుంచి తీసుకుందామని, ఆరోగ్యకరమైన వాతారణంలో పట్టణ ప్రజలు ఈ వేడుకను ఆస్వాదించేలా నిర్వహించి ప్రజలు, అధికారవర్గాల మన్ననలు పొందాలన్నారు. అనంతరం సాయంత్రం ఓ ఫంక్షన్‌హాల్లో పట్టణ ప్రముఖులు సమావేశం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై సమాలోచనలు జరిపారు.

కార్పొరేషన్ డైరెక్టర్లుగా మదనపల్లె నేతలు



రామకృష్ణాచారి   మైఫోర్స్ మహేశ్

మదనపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెకు చెందిన టీడీపీ, జనసేన నేతలను వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ సీనియర్ నేత, ఆర్.కె.జ్యువెలర్ అధినేత బంగారు రామకృష్ణాచారిని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం, అభివృద్ధి కార్పొరేషన్‌కు, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్సు మహేశ్‌ను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా నియమించారు. ఆయా కార్పొరేషన్లకు డైరెక్టర్ పదవితో మా బాధ్యతలు మరింత పెరిగాయని రామకృష్ణాచారి, మహేశ్ పేర్కొన్నారు. తమకు ఈ పదవి అప్పజెప్పిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాష, బంగారు రామకృష్ణాచారి, మైఫోర్సు మహేష్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నాదెళ్ల మనోహర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా కొండా భాస్కర్‌రెడ్డి



కొండా భాస్కర్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామ సర్పంచ్, మండల టీడీపీ నాయకుడు కొండా భాస్కర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తనను ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు, తన నియామకానికి సహకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డికి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



యుటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు

పీలేరు రూరల్, సెప్టెబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో చోటుచేసుకున్న అనేక సమస్యలను సత్వరం పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పీలేరులో నిర్వహించిన యూటీఎఫ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు పీఆర్‌సీ బకాయిలు, నాలుగు డీఏల అరియర్స్ ఇంకెప్పుడిస్తారని ప్రశ్నించారు.

2022లో పెట్టిన సంపాదిత సెలవు వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. 15వ తేదీన ప్రారంభం కానున్న యూటీఎఫ్ రణభేరి గోడపత్రికలను ఆవిష్కరించారు. బైక్ ర్యాలీలో ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ బాషా, కోశాధికారి చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి, యూనియన్ నేతలు ఆదినారాయణ, సుధాకర్ నాయుడు, ఆవు విశ్వనాథరెడ్డి, అక్రమ బాషా, రావుద్దీన్, సురేంద్రరెడ్డి, రమణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కోడూరు ఎక్సైజ్ శాఖాధికారుల అదుపులో గంజాయి స్మగ్లర్లు

రైల్వేకోడూరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట వద్ద శనివారం రాత్రి ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు విషయంగా ఎక్సైజ్ శాఖ అధికారులను వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని పూర్తి వివరాలను తర్వాత తెలియచేస్తామని తెలిపారు.

ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం

● 10 గ్రామాల ప్రజల్లో నెలకొన్న ఆనందం



పనులు చేస్తున్న కూలీలు

దువ్వూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. రెండు వారాల నుంచి ఈ పనులు చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో జూలై 3వ తేదీన ఆరోగ్య కేంద్రం నిర్మాణం అంతేనా అనే కథనం ప్రచురితమైంది. రూ.2.50 కోట్ల కేటాయింపుతో చేస్తున్న ఈ పనులు 40 శాతం పూర్తయిన అనంతరం బిల్లుల మంజూరు విషయంలో తలెత్తిన సమస్యలతో పనులు ఆగిపోయాయి. ఈ విషయం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి చొరవ తీసుకుని పూర్తి చేయాలని, తద్వారా పది గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయనే విషయం కథనంలో వివరించింది. దీనికి ఆలస్యంగానైనా స్పందించిన అధికారులు నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈ శివకుమార్ మాట్లాడుతూ 15 రోజుల కిందట పనులు తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. వీలైనంత త్వరగా ఆరోగ్యకేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఆరోగ్యకేంద్రం నిర్మాణం తిరిగి చేపట్టడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగంలో మెరుగైన సేవలు అందించాలి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వైస్‌చాన్సలర్, వైద్యులు

సీకేదిన్నె, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య రంగంలో మెరుగైన సేవలు అందించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య యూనివర్శిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. రాయచోటి రోడ్డులోని మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిజీషియన్ అసోసియేషన్ 53వ కాన్ఫరెన్స్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలకు ఎంతో ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను పీజీ విద్యార్థులకు కల్పించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలన్నారు. సేవాదృక్పథంతో వైద్య వృత్తిని విస్తరించాలన్నారు. లాభాపేక్ష లేకుండా వృత్తి ధర్మానికి కట్టుబడి మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో గౌరవ మర్యాదలు దక్కుతాయన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా 800 మందికిపైగా వైద్యులు హాజరై వివిధ ఆవిష్కరణలపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఫిజీషియన్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రిమ్స్‌లో సౌకర్యాలను మెరుగుపర్చండి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలో ఉన్న ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్) అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి కృషి చేసి వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన రిమ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమావేశమయ్యారు. రిమ్స్ వైద్య కళాశాల చాలా విస్తీర్ణంగా ఉందని, ఆవరణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు. వైద్య కళాశాల గెస్ట్ హౌస్, కళాశాల క్యాంటీన్, కళాశాల ఆడిటోరియం, ప్లే గ్రౌండ్‌ను త్వరలో ఏర్పాటు చేసేటట్లు దిశా నిర్దేశం చేశారు. ఆ తర్వాత వైద్య విద్యార్థులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల డే, ఇతర ఫంక్షన్‌లను ఎలా జరుపుకొంటున్నారని అడగ్గా బయట ప్రాంతాలను బుక్ చేసుకొని వేడుకలు జరుపుకొంటున్నామని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రిమ్స్ ఆడిటోరియం పనులపై దృష్టి సారించాలని, ఆరు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ చాన్సలర్ విజయభాస్కర్‌రెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. జిల్లాకు చెందిన ఇద్దరికి అవకాశం లభించింది. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బద్వేల్‌కి చెందిన టీడీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డిని, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రొద్దుటూరు టీడీపీ నాయకుడు డాక్టర్ వడ్ల శ్రీనివాసాచారిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు విడుదల చేసింది.

బత్తాయి ధర.. పతనం



బత్తాయికి మంగు సోకడంతో..



బత్తాయి కాయలకు మంగు సోకడం వల్ల ధర గణనీయంగా తగ్గింది. జాతీయ రహదారి కారణంగా దుమ్ము, ధూళి చెట్లపై పడడంతో అకారణంగా కాయలన్నీ నల్లగా మారిపోయాయి. పది క్వింటాళ్ల దిగుబడి వస్తుందంటే 4 క్వింటాళ్లే వచ్చింది.

- నరసింహారెడ్డి, చెన్నారెడ్డిపేట

50 టన్నులు మాత్రమే దిగుబడి వచ్చింది..



దాదాపు 15 ఎకరాల్లో బత్తాయి సాగు చేశాను. వంద టన్నులు దిగుబడి వస్తుందని ఆశిస్తే 50 టన్నులు మాత్రమే వచ్చింది. ఎకరాకు 4టన్నులు దిగుబడి వచ్చింది. 15ఎకరాలకు మార్కెట్లో టన్ను రూ.12వేల వంతున అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది రూ.20వేలు పలికితే ఈసారి రూ.12వేలు మాత్రమే ధర పలికింది.

- సిద్దు గుర్విరెడ్డి, చెన్నారెడ్డిపేట

పోరుమామిళ్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల పెంపకం లాభదాయకంగా ఉంటుందని ఆశించి దాదాపు ఐదేళ్లు చెట్లను ఫలసాయం వచ్చేంత వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటే తీరా కాపునకు వచ్చేటప్పటికి దిగుబడి తగ్గడం, రేట్లు పతనం కావడంతో అయోమయంలో పడిపోయారు బత్తాయి సాగు చేసిన రైతన్నలు. పోరుమామిళ్ల వ్యవసాయ డివిజను పరిధిలో దాదాపు 900 ఎకరాల్లో బత్తాయి (చీనీ) తోటలు సాగు చేశారు. మండలంలో బొప్పాపురం చెన్నారెడ్డిపేట, పుల్లీడు ప్రాంతాల్లో 150 ఎకరాలు, కాశినాయన మండలంలో 350 ఎకరాలు, బి.మఠం మండలంలో 300 ఎకరాలు, కలసపాడు మండలంలో 60 ఎకరాలు, బి.కోడూరు మండలంలో 130 ఎకరాల వరకు రైతులు చీనీ తోటలను సాగు చేశారు. ఎకరాకు రూ.4లక్షల వరకు పెట్టుబడి పెట్టి ఎకరాకు 120 మొక్కల వరకు పెంచుతారు. ఈ చెట్లను దక్కించుకునేందుకు ఎరువు, మట్టి బోద వేసి కాల్చడం వంటి పనులు చేపడతారు. చెట్టుకు వేరుపురుగు పట్టకుండా చుట్ట బోద వేసి కాలుస్తారు. తీరా కాపునకు వచ్చేసరికి పంట దిగుబడి తగ్గడం, ధర లేకపోవడంతో దిగాలు పడిపోయారు రైతులు. క్వాలిటీ ప్రకారం ఫస్ట్ గ్రేడ్,

● నష్టాల బాటలో చీనీ రైతులు

సెకండ్ గ్రేడ్, థర్డ్ గ్రేడ్ ప్రకారం వ్యాపారస్తులు వాటికి ధరలు నిర్ణయిస్తారు. రూ.8వేల నుంచి రూ.16వేల వరకు గ్రేడ్‌ను బట్టి ధర పలుకుతుంది. ఎకరాకు కనీసం 10 నుంచి 13 టన్నుల దిగుబడి రావాల్సి ఉంది. కానీ దిగుబడి సగానికి సగం పడిపోవడంతో ఎకరాకు 5, 6 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుంది. గత ఏడాది టన్ను రూ.20వేల ధర పలుకగా ప్రస్తుతం రూ.8వేలు, రూ.10వేలు, రూ.12వేల వరకు ఉంది. అంతేకాకుండా కొన్ని తోటల్లోని చీనీకాయలకు మంగు రావడంతో వ్యాపారస్తులు రేట్లను కూడా తగ్గిస్తున్నారు. బయట మార్కెట్లో వందకు మూడు కేజీలు వంతు అమ్ముతున్నా రైతులు మాత్రం రూ.10కే వ్యాపారస్తులకు అమ్మాల్సి వచ్చిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని, కష్టాలు కన్నీళ్లు నష్టాలే మిగిలాయని బత్తాయి రైతులు వాపోతున్నారు.

ఈ విషయమై ఉద్యానవనశాఖాధికారి శ్రీనివాసులరెడ్డిని వివరణ కోరగా బత్తాయికి రెండు సీజన్లలో కాపు వస్తాయని గ్రేడ్‌ను బట్టి రూ.8వేల నుంచి రూ.16వేల వరకు ధర పలుకుతుందని తెలిపారు. వేసవి సీజన్‌లో ధర పలికితే రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.



గిట్టుబాటు ధర ఎక్కడ?

అట్లూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చీనీ కాయలకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో 1500 ఎకరాల్లో చీనీ సాగు చేశారు. ఎకరాకు ఆరు టన్నుల నుండి పది టన్నుల వరకు దిగుబడి వస్తుంది. టన్ను రూ.30వేలకు దళారులు కొనుగోలు చేస్తే పెట్టుబడులు మాత్రమే వస్తాయని, రూ.30వేలకు పైబడి కొనుగోలు చేస్తే గిట్టుబాటు ధర ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితి రూ.15 వేలు మాత్రమే ఉండటంతో పెట్టుబడులు కూడా రావని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీనీ కాయలను నెల్లూరు, మద్రాసుకు రవాణా చేసి దళారులు అక్కడ రూ.30వేలకు వరకు విక్రయిస్తూ రైతులను దగా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. 2004 నుండి 2019 వరకు చీనీతోటల పునరుద్ధరణ పేరుతో ప్రభుత్వం చీనీ తోటలు సాగు చేసిన రైతులకు ఎరువులు, చెట్ల కత్తిరింపు కత్తెరలు, ఎకరాకు రూ.12వేల చొప్పున ప్రోత్సాహం ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2022-23లో క్రాప్ డామేజ్‌కు ప్రభుత్వమే ఇన్సురెన్స్ డబ్బులు చెల్లించింది. 2024లో ప్రభుత్వం ఇన్సురెన్స్ డబ్బులు చెల్లించకపోవడంతో రైతులకు క్రాప్ డ్యామేజీ డబ్బులు అందలేదు. అదే బాటలో కూటమి ప్రభుత్వం కూడా ఇన్సురెన్స్ డబ్బులు చెల్లించకపోవడంతో చీనీ తోటలు సాగు చేసిన రైతులకు ప్రోత్సాహం కరువైంది. చీనీ కాయలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

పాఠశాల కరస్పాండెంట్‌పై పోక్సో కేసు

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పాఠాలు చెప్పాల్సిన గురువు, కూతురు వయస్సున్న బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినందుకు శనివారం ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌పై మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మైదుకూరు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ బాలికతో ఆ పాఠశాల కరస్పాండెంట్ కొన్ని రోజులు క్రితం అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆ బాలిక జరిగిన విషయాన్ని ఎవ్వరికి చెప్పకుండా ఈనెల 11వ తేదీన విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో తల్లిదండ్రులు విషద్రావణం ఎందుకు తాగావని గట్టిగా అడగడంతో బాలిక తన పాఠశాల కరస్పాండెంట్ చేసిన నిర్వాకం బయట పెట్టింది. మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు.

పెద్దనపాడులో యువతి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనపాడు గ్రామంలో శనివారం రాత్రి యువతి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. పెద్దనపాడుకు చెందిన గంగ(24) ఉరి వేసుకున్నట్లు తెలిపారు. ఆమె మృతికి పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదని, ఆ విషయమై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ప్రేమించిన వాడు మోసం చేయడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా బంధువులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై శనివారం రాత్రి ఎస్‌ఐ నాగమురళి బాధితులను విచారించారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-23 మెన్స్ మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లలో శనివారం నెల్లూరు-చిత్తూరు, అలాగే కర్నూలు-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి.

ఏసీఏ క్రికెట్ మైదానంలో..: రిమ్స్ సమీపంలోని వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 554 పరుగులు చేసిన అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 96పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 211 పరుగులకే కుప్పకూలింది. దీంతో నెల్లూరు జట్టుకు 343 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. భారీ స్కోర్ సాధించే క్రమంలో రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో..: కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 410 పరుగులకు ఆలౌట్ అయింది. శనివారం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు 11.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 74 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 16.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు ప్రకటించారు. కాగా కర్నూలు జట్టుకు మొదగి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత లభించింది.

కూటమి మైత్రికి భంగం కలిగిస్తున్న ఎమ్మెల్యే

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్న సంగతిని కడప ఎమ్మెల్యే మాధవి మరచిపోయారని, ఆమె కూటమి మైత్రికి భంగం కలిగించేలా బీజేపీ, జనసేన వారిని ఏమాత్రం సంప్రదించకుండా ఒంటెద్దు పోకడతో ముందుకు సాగుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కడప నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రస్థాయిలో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తూ సుపరిపాలన అందిస్తున్నాయన్నారు. కాగా కడప జిల్లాలో మాత్రం టీడీపీ నాయకులు అందుకు విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అత్యంత సమన్వయంతో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. అదే పంథాలో జిల్లాలోని టీడీపీ నాయకులు కూడా సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. బీజేవైయం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి, హత్యాయత్నం కేసు నమోదు

పులివెందుల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పులివెందుల సమీపంలోని జేఎన్టీయూ వద్ద శుక్రవారం ఆనంద్‌రావు అనే వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని, దీనిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి 6.30గంటల ప్రాంతంలో ఆనందరావు జేఎన్టీయూ కళాశాల సమీపంలో రక్తగాయాలతో రోడ్డు పక్కన పడిపోయారు. ఇది రోడ్డు ప్రమాదమా లేక ఎవరైనా దాడి చేశారా అనే విషయం అప్పుడు వెలుగుచూడలేదు. కానీ ఆనందరావు భార్య కరుణమ్మ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

చెన్నూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఊరేగింపు సందర్భంగా ఎస్సీలను అవమానకరంగా మాట్లాడి కులం పేరుతో దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరసింహులు అన్నారు. చెన్నూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ స్థానిక తూర్పువీధిలో ఎస్సీలు వినాయకచవితి సందర్భంగా గత నెల 28న ఊరేగింపు నిర్వహిస్తుండగా వచ్చే దారిలో ఓ వర్గంవారు ఊరేగింపును అడ్డుకోవడం, పలు రకాల మాటలు మాట్లాడడం జరిగిందన్నారు. పైగా కులం పేరుతో దూషించడం దారుణమన్నారు. ఈ విషయంపై తాము ఫిర్యాదు చేశామని, అయితే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి ఎస్సీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ వల్లూరు మండల అధ్యక్షుడు సురేశ్, చెన్నూరు మండల అధ్యక్షుడు రాంబాబు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు సుదర్శన్, వెంకటసుబ్బయ్య, గంగమ్మ, కొండమ్మ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ : డీఎస్పీ

చెన్నూరులో వినాయక చవితి సందర్భంగా జరిగిన సంఘటనలో ఎవరికీ అన్యాయం జరగదని, నిష్పక్షపాతంగానే విచారణ జరుగుతోందని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఆయన పలువురు తూర్పు దళితవాడకు చెందిన వారిని జరిగిన సంఘటనపై విచారించి వివరాలను రికార్డు చేసుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో కిందపడి వృద్ధుడికి గాయాలు

కొండాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో కిందపడి శనివారం సుమారు 70 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడికి గాయాలయ్యాయి. ఇతడు స్టేషన్‌లో ట్రాక్‌పై ప్రమాదవశాత్తు జారిపడ్డాడా లేదా ఎదైనా ట్రైన్‌లో నుంచి జారిపడ్డాడా అని తెలియాల్సి ఉంది. ఇతని తలకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో తాడిపత్రికి తరలించారు. ఇతను రైల్వేస్టేషన్ పరిసరాల్లో బిచ్చమెత్తుకొని జీవిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇతని వివరాలు తెలియరాలేదు.

మిద్దెకూలి వృద్ధురాలికి గాయాలు

కొండాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో శనివారం దస్తగిరమ్మ(70) అనే వృద్ధురాలికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. ఈమె నివసిస్తున్న మట్టిమిద్దెలో ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు మెత్తబడ్డాయి. దీంతో ఇంటి పై కప్పు కూలిపోవడంతో పాటు దంతెలు విరిగి ఆమె మీద పడ్డాయి. తలకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో ఆమెను తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్టు

● సుమారు 60కేజీల రాగివైరు స్వాధీనం

గోపవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో చోరీ కాబడిన ట్రాన్స్‌ఫార్మర్ల కేసుల్లో ముగ్గురు నిందితులను శనివారం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. దాసరి శివ, దాసరి ఉపేంద్ర, జగన్నాధం, సాయి కుమార్‌లను అరెస్టు చేసినట్లు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణయ్య తెలిపారు. శనివారం ఉదయం 8గంటల సమయంలో బి.కోడూరు మండలంలోని పెదుళ్లపల్లె గ్రామం క్రాస్ రోడ్డు (బద్వేలు - పోరుమామిళ్ల మెయిన్ రోడ్డు) వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. వీరు ఒక ముఠాగా ఏర్పడి బి.కోడూరు, బద్వేలు, గోపవరం మండలాల్లోని గ్రామాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి రాగివైరును దొంగలించినట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని సుమారు 60 కేజీల చోరీ కాబడిన రాగివైరును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు. కార్యక్రమంలో బి.కోడూరు సబ్ ఇన్‌స్పెక్టరు సురేశ్, బద్వేలు రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ పదోన్నతులలో పదనిసలొద్దు

● ఆర్టీసీ ఈయూ జోన్ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

కడప మారుతీనగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులలో పదనిసలకు తావు లేకుండా ప్రభుత్వంలో విలీనానికి ముందే చేరిన ఉద్యోగులకు విలీనానికి ముందున్న పాత పద్ధతుల్లోనే పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఆర్టీసీ జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్ అధ్యక్షతన ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కడప జోన్‌కు చెందిన 8 జిల్లాల రాష్ట్ర, జోన్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో జోన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసీలో పదోన్నతులు కల్పించాలని కోరుతూ సంబంధిత ఉద్యోగసంఘాలు పలుమార్లు ఆర్టీసీ ఎండీ దృష్టికి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి గత నెల 28న ఆర్టీసీ ఉద్యోగులకు పాత పద్ధతుల్లోనే పదోన్నతులు ఇచ్చేలా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. ఇందుకు సంబంధించిన జీవో డ్రాఫ్ట్‌ను టీఆర్ అండ్ బీ అధికారులు జీఏడీ గత నెలలోనే పంపారన్నారు. అయినా అక్కడ ఉన్న ఒక అసిస్టెంట్ కమిషనరు స్థాయి అధికారి అనవసరంగా ఈ పదోన్నతులపై వాదనలు చేస్తూ అడ్డుకోవడం వల్ల ఆరేళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న ఆరువేల మంది ఉద్యోగులు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగులందరికీ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రివర్స్ పీఆర్సీపై న్యాయం చేస్తారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటిస్తారని, 12వ పీఆర్సీ వేస్తారని, అలాగే 11వ పీఆర్సీకి సంబంధించిన 24నెలల అరియర్స్‌తో పాటు డీఏ అరియర్స్ కూడా ప్రకటిస్తారని ఎంతగానో ఎదురు చూస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరం అవుతున్నా ఇచ్చిన హామీల అమలులో జాప్యం చేస్తోందన్నారు. ఉద్యోగులు ఉద్యమ బాట పట్టకముందే త్వరితగతిన ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం ముమ్ముందు విజయవంతంగా ముందుకు సాగాలంటే ప్రస్తుతం ఉన్న బస్సులు సరిపోవడం లేదని, మరో మూడు వేల బస్సులు కొనుగోలు చేయాలని, ఆర్టీసీ అన్ని కేటగిరిల్లో ఉన్న సుమారు 10వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టాలనుకుంటున్న విద్యుత్ బస్సులన్నీ ప్రైవేటు ఆపరేటర్లతో నడవకుండా ఆర్టీసీ సిబ్బందితో నడిపేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, సుబ్రమణ్యంరాజు, మద్దిలేటి, కడప జోనల్ వర్క్‌షాపు నాయకుడు అంకిరెడ్డి, ఏఆర్ మూర్తి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించడం అందరి బాధ్యత

వేంపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించడం అందరి బాధ్యత అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా పాపాఘ్నినది ఒడ్డున వెలసిన ఎద్దుల కొండ ఆలయం పరిధిలో శనివారం మొక్కలు నాటారు. ఆలయ అర్చకుడు హరిప్రవీణ్, మాజీ సభ్యులు పీవీ రమణ, టీడీపీ యువనాయకుడు రజనీకాంత్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన మాజీచైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు,సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆవులదాడితో రైతుల బెంబేలు..!

పట్టించుకోని ఆవుల యజమానులు



నాయనోరిపల్లెకు చెందిన ఆవుల యజమానులు ఆవులను దగ్గరుండి మేపుకోకుండా వదిలివేస్తున్నారు. దీంతో పంటలను తొక్కి నాశనం చేస్తున్నాయి. పసుపు పంటను సాగు చేశాను. పంటను ప్రతిరోజు ఆవులు గుంపులుగా వచ్చి తొక్కివేస్తున్నాయి. దీంతో పంటను కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

మాదం నాగమునెయ్య, బలిజపల్లి

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



ఆవుల యజమానులపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించడంలేదు. దీంతో కూరగాయలు, ఆకుకూరలు వేసి సాగు చేసిన పంటలు తొక్కివేస్తున్నాయి. ఇప్పటికైనా రైతుల సమస్యను అధికారులు స్పందించి పరిష్కరించాలి.

వల్లెపు గంగిరెడ్డి, బలిజపల్లె





తోటల్లో మేస్తున్న ఆవులు

సీకేదిన్నె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆవులు పంట పొలాలపై దాడి చేస్తుండడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఆవులను ఎంతో పవిత్రంగా పూజించే దేశంలో ఆవులంటే హడలిపోయేపరిస్థితులు రైతులు ఎదుర్కొంటున్నారు. బలిజపల్లి, కొమ్మేపల్లె, పెద్దముసల్‌రెడ్డిపల్లె, మామిళ్ళపల్లి తదితర చోట్ల ఆవుల యజమానులు వాటిని యథేచ్ఛగా వదిలేయడంతోనే సమస్య వస్తోందని రైతులు వాపోతున్నారు. యజమానులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని, దీంతో తమ పంట తిని తొక్కివేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి కష్టపడి భూమిని దున్ని పంటలను ఎంతో జాగ్రత్తగా పెంచి పోషిస్తున్న రైతులు కళ్లముందే ఆవులు తొక్కి వేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఆవులు వచ్చి పంట పొలాలపై పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికైనా ఆవుల యజమానులు వాటిని పంటపొలాలపై వదలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

చక్రాయపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని కమ్యూనిటీ సోషల్ వర్కర్ భారతి పేర్కొన్నారు. శనివారం గండి క్షేత్రంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివనాగమునెమ్మ, వాణి, శ్రీనివాసరెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఆర్పీలపై రుద్దడం మానుకోవాలి

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఆర్పీలు ఒక్కొక్కరు 100 కనెక్షన్లు తప్పనిసరిగా దరఖాస్తులు చేయించాలని మెప్మా అధికారులు ఒత్తిడి తీసుకురావడం మానుకోవాలని ఆర్పీల అసోసియేషన్ ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు బాదుల్లా పేర్కొన్నారు. శనివారం స్థానిక హోచిమిన్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశం లో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు, సునీల్ పాల్గొన్నారు.

గౌరవ వేతనాలు విడుదల చేయాలి

చక్రాయపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న జడ్పీటీసీలకు, ఎంపీపీలకు కొన్నినెలలుగా గౌరవ వేతనాలు అందకపోవడం పట్ల చక్రాయపేట జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రజలకు సమీపంగా ఉండిసేవలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు తగిన గౌరవ వేతనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అభిషేకం



వల్లూరు , సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుమారునిపల్లె గ్రామం వద్ద వరాల ఆంజనేయస్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కృత్తికా నక్షత్రం సందర్భంగా వైభవంగా పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వరాల ఆంజనేయస్వామి దేవాయంలో ముందుగా విఘ్నేశ్వరునికి అభిషేకం అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని అభిషేకించారు. అనంతరం మురారీ ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామికి అష్టోత్తర అర్చన నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి తదితరులు

సీకేదిన్నె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతికతను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ అందిపుచ్చుకోవాలని అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. స్థానిక రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కంప్యూటర్‌సైన్స్ విభాగంలో విద్యార్థుల అసోసియేషన్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్వాంటమ్ టెక్నాలజీని డెవలప్ చేసుకుని అసోసియేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాసంస్థల వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్‌సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి సుబ్బయ్య, సిబ్బంది, ఏవో రామసుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

‘మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ వద్దు’



మాట్లాడుతున్న నగర అధ్యక్షుడు సయ్యద్ గౌస్‌పీర్

కడప కలెక్టరేట్,సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలలను ప్రవేటీకరణతో పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చట్టడమే అని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్‌పీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా 5వ డివిజన్ అశోక్‌నగర్ లో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగర అధ్యక్షుడు సయ్యద్ గౌస్ పీర్, జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్ మాట్లాడుతూ కూటమి సర్కారులో సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఆధీనంలో మెడికల్ కళాశాలలు నడపాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఫజులుల్లా, సాయిపేట ఇన్‌చార్జి దాసరిశ్రీనివాసులు,కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు సత్వరం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాష డిమాండ్ చేశారు. శనివారం ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు 13వ తేదీన ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా పులివెందులలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణం విడుదల చేయాలన్నారు.కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్,సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 11వ వేతన సవరణ గడువు జూలై 2023తో ముగిసినందున వెంటనే 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించి, రిపోర్ట్ వచ్చేలాగా ఉద్యోగులకు దసరా కానుకగా 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణంరాజు కోరారు. శనివారం పులివెందులలో శాసనమండలి సభ్యులు రామగోపాల్‌రెడ్డిని కలిసి పలు ఉపాధి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కూరాకు రవీంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్ గఫూర్, నాయకులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన గండి క్షేత్రం



దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

చక్రాయపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున భక్తులు రావడం విశేషం. అందులోనూ మహిళలు ఎక్కువగా దర్శనానికి పాల్గొనడం మరో ఒక విశే షం. ఉదయం 7 గంటల నుంచి క్యూలైన్లలో నిలబడి భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. స్పెషల్ దర్శనం, సర్వదర్శనం, వీఐపీ క్యూలైన్లు మూడు కూడా కిక్కిరిసిపోయాయి. ప్రసాదాలకు కూడా గంటపాటు నిలబడ్డారు. భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్యూలో నిల్చున్నారు.స్పెషల్ దర్శనం టికెట్ల ద్వారా దాదాపు రూ.1.20లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిసింది. అలాగే భక్తులకు అన్నదానం గావించారు.

నేటి పోలేరమ్మ త్రిశూల ప్రతిష్ఠను విజయవంతం చేయండి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో కొలువైన గ్రామదేవత పోలేరమ్మ ఆలయం వద్ద ఆదివారం త్రిశూల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీరాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పోలేరమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠాప నకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు లక్షుమయ్య, త్రిశూల ప్రతిష్ఠ కమిటీ నాయకులు, హిందూ ఐక్యవేదిక నాయకులు, బలిజసంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ మండల శాఖ అధ్యక్షుడి నియామకం

చెన్నూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మండల బీజేపీ అధ్యక్షుడు పెడబల్లె వెంకటసుబ్బారెడ్డిని ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడుగా ఎన్నికైన వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆదిమూలం వెంకటసుబ్బయ్య,పెడబల్లె సరోజనమ్మ, ముకుందస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్

కడప క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శక్తియాప్ మహిళలు, బాలికల రక్షణకు ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని కడప తాలుకా ఎస్ఐ తులసి నాగప్రసాద్ అన్నారు. శక్తియాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో అల్లూరి సీతారామరాజు నగర్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

డ్రగ్స్‌రహిత సమాజం సాధ్యం..

డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కడప టూటౌన్ సీఐ జి.సుబ్బారావు పిలుపునిచ్చారు. కడప టూటౌన్ పీఎస్ పరిధిలోని బిస్మిల్లానగర్‌లో శనివారం సాయంత్రం పోలీసు కళా జాగృతి బృందం ఆధ్వర్యంలో ఓ యువతా మేలుకో నాటక ప్రదర్శన నిర్వహించారు. సమాజంలోని రుగ్మతల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కడప టూటౌన్ ఎస్ఐ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

పనుల పర్యవేక్షణకు కమిటీ నియామకం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయం అభివృద్ధి కోసం కొత్త భవననిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు వైస్‌చాన్సెలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆదేశాలు జారీచేశారు. కాగా కమిటీకి చీఫ్ ఇంజనీర్,యోగివేమన విశ్వ విద్యాలయం చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. కన్వీనర్‌గా వైవీయూ రిజిస్ట్రార్, బాధ్యతలు నిర్వర్తిస్తారని చెప్పారు. ఇతర సభ్యులను నియమించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు మహమ్మద్ షఫిఉల్లా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం పీఎస్‌యు కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు,రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు సభ్యులు పాల్గొన్నారు.

కాల్వలోకి దూసుకెళ్లిన స్కార్పియో

పులివెందుల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రిపల్లె వద్దమోటార్ బైకును తప్పించబోయి స్కార్పియో వాహనం అదుపు తప్పి కాల్వలో పడింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. కదిరి మండలం ఏకదట్ల తాండాకు చెందిన కిరణ్‌కుమార్ నాయక్ అనే వ్యక్తికి జమ్మలమడుగు వద్ద ఉన్న చిటిమిటిచింతల తాండాలో పెళ్లిచూపులకు వెళ్లారు. తిరిగి వస్తుండగా రాయలాపురం దాటిన అనంతరం పీబీసీ కాల్వ గట్టుపై నుంచి మోటార్ బైకుదారుడు నేరుగా ప్రధాన రహదారిలోకి వచ్చాడు. అతనిని తప్పించబోయి కల్వర్టును ఢీకొట్టి కాల్వలోకి స్కార్పియో పల్టీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. అందులో కిరణ్‌కుమార్‌నాయక్ నడుములు, డ్రైవర్ మహేంద్రబాబు, నారాయణస్వామి నాయక్‌కు కాలు విరిగింది. చంద్రానాయక్‌కు చేయి విరగ్గా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్త ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ హాజీవల్లి తెలిపారు.



పీ4పద్ధతి ద్వారా పాఠశాలను అభివృద్ధి చేయడం అభినందనీయం : ఎమ్మెల్యే



స్కూల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేసిన పీ4 పథకం ద్వారా అగాడి మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి చేయడం అభినందనీయమని కడప ఎమ్మెల్యే మాధవి తెలిపారు. శనివారం కడప నగరం అగాడి మున్సిపల్ అప్పర్ ప్రైమరీ ఉర్దూ పాఠశాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఈ పాఠశాల ఫ్లోరింగ్,పెయింటింగ్స్ బాగోలేదని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రధానోపాధ్యాయులు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. అయితే ఈ పనులను పీ4 పద్ధతి ద్వారా టీడీపీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు క్రీసెంట్ జిలాని బాష సహకరించి పనులు పూర్తిచేశారని చెప్పారు. అనంతరం జిలాని బాషను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ పాఠశాలల సూపర్‌వైజర్ ఫరూక్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు పక్కా గృహాలు ఇవ్వడమే లక్ష్యం

వేంపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైనపేదలందరికీ ప్రభుత్వం ద్వారా పక్కా గృహాలు మంజూరు చేయడమే లక్ష్యమని గృహనిర్మాణ శాఖ డైరెక్టర్ బోరెడ్డి జగన్నాథరెడ్డి తెలిపారు. డైరెక్టర్‌గా నియామకమైన జగన్నాథరెడ్డిని దేవస్థాన మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, మాజీ సభ్యుడు పి.వెంకటరమణ, మాజీ వార్డు సభ్యుడు నల్లగారి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు శ్రీరామిరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మ, గ్రంథాలయ మాజీచైర్మన్ బాలస్వామిరెడ్డి, నాయకులు గోవర్దన్‌రెడ్డి, ఎల్‌బీఆర్ భాస్కర్‌రెడ్డి, లాడెన్ బాషపాల్గొన్నారు.

రాజ్యాంగ చట్టాలను అవగతం చేసుకోండి

కడప మారుతీనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని చట్టాలను ప్రతి ఒక్కరూ అవగతం చేసుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి శివనాగేశ్వర్‌రావు గౌడ్ సూచించారు. శనివారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 4,5,6 తేదీల్లో కేంద్ర మంత్రి రామ్‌దాస్ అత్వాలే ఏపీ పర్యటనలో భాగంగా తిరుమలకు రానున్నారన్నారు. దేశంలో ప్రతి లక్ష మందిలో సుమారు 5వేలమందికి వినికిడిశక్తి తగ్గి చెవిటి వారుగా మారుతున్నారని అన్నారు. అందులో భాగంగా చంద్రబాబు ఆధ్వర్యంలో మంగళగిరిలోని సీకే ఫంక్షన్‌హాలులో అత్వాలే చేతుల మీదుగా రాష్టంలోని ఐదు వేల మందికి వినికిడి యంత్రాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఆ పార్టీ జాతీయ నాయకులు అజయ్ ప్రసన్న పాల్గొన్నారు.


ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించండి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని మండల వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ తాహా విద్యార్థులకు సూచించారు. శనివారం సంక్షేమ వసతిగృహాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యోగేశ్వరయ్య, ఏఎన్ఎమ్‌లు రమణమ్మ, అంజనమ్మ, ఆశాకార్యకర్త అమ్మణ్ణి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి

వేముల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డాక్టర్ శరణ్య సూచించారు. శనివారం వేములలోని హాస్టల్‌ను ఆమె పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఉషారాణి పాల్గొన్నారు.

మొక్కజొన్న.. రైతన్నకు లాభమన్నా


మొక్కజొన్న పంట

రాజుపాలెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో కుందూ, బోర్ల కింద సాగుచేసిన మొక్కజొన్న రైతన్నలకు లాభసాటి పంటగా నిలిచింది. గత మూడేళ్లుగా ఈ పంటపైనే రైతన్నలు మొగ్గు చూపడానికి గల కారణం తక్కువ ఖర్చు అధిక దిగుబడి రావడమేనని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో కొట్టాల, కూలూరు, వెలవలి, టంగుటూరు, దువ్వూరు మండలంలోని జిల్లెల్ల, భాకరాపేట గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల పైబడి ఈ పంట సాగులో ఉంది. ఎకరాకు విత్తనం ఖర్చు రూ.3వేలు, సేద్యాల ఖర్చు రూ.2వేలు , ఎరువులు రూ.10వేలు, గుత్త, కూలీల ఖర్చు రూ.35వేలు పోను ఎకరాకు రూ.30వేల నుంచి రూ.40వేలు మిగుతులుండడంతో ఈ పంటపై రైతన్నలు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఎకరాకు 25 నుంచి 40 క్వింటాల్లు దిగుబడి వస్తుండడంతో రైతులు ఈ పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. ముఖ్యంగా ఖరీఫ్, రబీ, వేసవిలోనూ మూడు దఫాలుగా ఒకే పంటను గత మూడేళ్ల నుంచి సాగుచేస్తున్నారు. మొక్కజొన్నలు రొట్టెపిండి, బిస్కట్లు, పాప్‌కార్న్, ఔషధాలు, ఆల్కహాల్, కాగితం పరిశ్రమలకు ముడిసరుకుగా ఉపయోగిస్తున్నారు. పశువులకు కోళ్లదాణాగా ఇతర పశు ఉత్పత్తులకు ముడి సరుకుగా ఈ మొక్కజొన్నలు ఉపయోగపడుతున్నాయి. దీంతో పండిన పంటకు క్వింటాకు రూ.2200 నుంచి రూ.2700 వరకు చెల్లించి కొనుగోలు చేస్తుండడంతో ప్రతి రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రాబోవు కాలంలో మొక్కజొన్న సాగు విపరీతంగా పెరుగుతుందని రైతులంటున్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో నరసింహస్వామి

బద్వేలు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం వేకువజామున స్వామివారికి అభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింగపల్లె వద్ద 622 సర్వేనెంబరు గుర్రాలబాటలో అక్రమంగా వేసిన ఫెన్సింగ్‌ను తొలగించకుంటే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. మండలంలోని నరసింగపల్లెలో గుర్రాలబాట స్థలం ఆక్రమణకు గురైందని పత్రికల్లో వార్తలు రావడంతో స్పందించిన రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేసి ఫెన్సింగ్‌ను తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. ఇంతలో పెన్సింగ్ వేసిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి తనకు గడువు ఇసే తానే స్వచ్ఛందంగానే తొలగిస్తానని చెప్పడంతో వారు అతనికి తొలగించకుంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి, మండల సర్వేయరు, వీఆర్వో ఓబయ్య పాల్గొన్నారు.,

ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి


మృతుడు వెంకట సుబ్బయ్య

బద్వేలుటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి) :ఎక్సైజ్ కార్యాలయానికి వాయిదా కోసం వచ్చిన వాకమల్ల వెంకటసుబ్బయ్య (33) అనే ఆటోడ్రైవర్ శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. మృతుడు వాకమల్ల వెంకటసుబ్బయ్య అట్లూరు మండలం రంగంపల్లెలో నివాసం ఉండేవాడు. మృతుడు ఆటోనడుపుతూ జీవనం సాగించేవాడు. గత 15 నెలల క్రితం ఆటోలో మద్యం తీసుకువస్తుండగా ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. దీంతో అతను వాయిదాలకు తిరుగుతూ శనివారం ఎక్సైజ్ కార్యాలయానికి రాగానే ఉన్నట్లుండి స్పృహతప్పి కింద పడిపోవ డంతో వెంటనే అక్కడున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా గుండెపోటుతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పోలీసులు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య శశికళ, పిల్లలు చరణ్‌తేజ్, మహిమన్విత, రియాలు ఉన్నారు.

నాటు సారా స్వాధీనం

ముద్దనూరు, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి):మండలంలోని శివాలయం సమీపంలో శనివారం విజయకుమార్ అనే వ్యక్తి నాటు సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. ఉప్పలూరు గ్రామానికి చెందిన విజయకుమార్‌ను అరెస్టు చేసి 5లీటర్ల నాటు సారా స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనాథ వృద్ధులకు చేయూత

బద్వేలుటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆనందనిరాశ్రయుల ఆశ్రమంలో ఆర్‌ఎస్ ఫౌండేషన్ గౌరవ సలహాదారు రవిశంకర్ ఆధ్వర్యంలో భోజనం, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరాలేని అనాథవృద్ధులకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఉపాధ్యాయుడు వెంకటరమణ, సురేష్‌బాబు, నాగార్జున, నాగరాజు, నరసారెడ్డి పాల్గొన్నారు.

ఆస్తుల స్వాధీనానికి కడప కోర్టు ఉత్తర్వులు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాధా కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్టనర్స్ అయిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మరో 17 మందికి చెందిన రెండు ఆస్తుల స్వాధీనానికి కడప సెషన్స్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రాధా కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ తన వ్యాపార లావాదేవీలకోసం గోపవరం పంచాయతీలోని సర్వేనెంబరు 670/ఏ1సి1 లోని 2.23 ఎకరాల విస్తర్ణం గల కామిశెట్టిసుబ్బరావు కాలేజీని, శాస్త్రినగర్‌లోని సర్వేనెంబరు 317/1లోని 2/573 డోర్‌నెంబరు గల జి.నారాయణమ్మకు చెందిన 6 సెంట్ల ఇంటిని హైదరాబాదుకు చెందిన పృథ్వీ అసెట్ రీ కన్‌స్ట్రక్షన్ సెక్యూరిటైజేషన్ కంపెనీకి తనఖా పెట్టి అప్పుతీసుకున్నారు. ఈ అప్పు చెల్లించనందున తనఖాలో ఉంచిన ఆస్తులను వేలంలో సదరు కంపెనీ దక్కించుకుంది. ఈ రెండు ఆస్తులను సెప్టెంబరు 16 లోపల స్వాధీనం చేయించేలా అడ్వకేట్ కమిషన్‌ను కోర్టు ఆదేశించింది. అందుకు అవవసరమైతే పోలీసు భద్రత కూడా తీసుకోమంది.

గోపవరంలో ఉచిత వైద్యశిబిరం


ఈసీజీ పరీక్షలను పరిశీలిస్తున్న బచ్చల పుల్లయ్య

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని గోపవరంగ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శనివారం ప్రొద్దుటూరుకు చెందిన శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రి, అభిలాష్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరాన్ని చేపట్టారు. గ్రామస్థులకు కంటి, గుండె, ఇతర వైద్య పరీక్షలను నిర్వహించి సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చల పుల్లయ్య, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ పట్నం లక్ష్మణ్, స్థానిక నాయకులు బచ్చల వీరప్రతాప్, అంజి, బాలయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా రైతులకు ఎరువులు అందిస్తాం

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని సోమిరెడ్డిపల్లె సహకార సంఘం (సొసైటీ) ద్వారా రాబోవు రోజుల్లో రైతులకు, పంట పొలాలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను అందిస్తామని సహకార సంఘం చైర్మన్ వెల్లటూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన సొసైటీ సీఈవో రామిరెడ్డితో సమావేశమై మండల వ్యాప్తంగా ఎంత మంది రైతులున్నారు. ఏఏ పంటలు పండిస్తున్నారు, ఎంత మోతాదులో ఎరువులు అవసరం పడతాయన్న సమాచారాన్ని అడిగారు. ఈసమాచారాన్ని జిల్లా అధికారులకు తెలిపి రాబోవు రోజుల్లో సొసైటీ ద్వారా ఎరువుల రైతులకు పంపిణీ చేస్తామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టరు చెవుల వెంకటేశ్వర్లు, సీఈవో రామిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరు సమాజసేవ చేయాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు సమాజ సేవ చేయాలని జమ్మలమడుగు రోటరీ క్లబ్ అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి సూచించారు. శనివారం జమ్మలమడుగులోని గూడెం చెరువు జ్యోతి మనోవికాస కేంద్రంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రోటరీ క్లబ్‌సెక్రటరి సంజీవరాయుడు జ్యోతి మనోవికాస కేంద్రంలోని మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి వారితో మాట్లాడారు. రోటరీ క్లబ్ సేవ చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్, న్యాయవాది మురళీధర్‌రెడ్డి, జోనల్ సెక్రటరి కుండా భాస్కర్, ఉపాధ్యక్షుడు బేపారి మహమ్మద్‌రఫి, జ్యోతి మనోవికాస కేంద్రం నిర్వాహకుడు సుధాకర్, చిన్నారులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌కు వ్యక్తిత్వ వికాసం కావాలి

బద్వేలు, సెప్టెంబరు 13, (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్‌లో ముందుకు సాగాలంటే వ్యక్తిత్వ వికాసం తప్పనిసరి అని చిన్మయ మిషన్ కడప శాఖ అధ్యక్షులు స్వామి తురియానంద పేర్కన్నారు. శనివారం స్థానిక నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాలలో యువతలో యువతలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భగవద్గీత నేటి యువతకు ఆదర్శమన్నారు. నేడు ఒడిదుడుకులు ఎదుర్కొని జీవించాలాంటే గీతా పారాయణం ఒక దిక్సూచి లాంటిదన్నారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి సాయిక్రిష్ణ, ప్రిన్సిపాల్ ఓబులేసు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మా పొలాలకు రోడ్డు ఏర్పాటు చేయండి

● గండికోట ప్రాజెక్టు ముంపు వాసుల వేడుకోలు


వర్షం పడితే పొలాలకు వచ్చేందుకు ఇబ్బందులుపడుతున్న రైతులు

ముద్దనూరు సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి):గండికోట ప్రాజెక్టుకు భూములు, ఇళ్లు కోల్పోయమని, కనీసం ఉన్న భూములకు రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని వెంటనే రహదారి సౌకర్యం కల్పించాలని కొర్రపాడు రైతులు అధికారులను వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే...ముద్దనూరు మండలంలోని కొర్రపాడు గ్రామం గండికోట ప్రాజెక్టు ముంపునకు గురైంది. ఇళ్ల తో సహా చాలా భూములు కోల్పోయారు.గండికోట ప్రాజెక్టుకు 720 ఎకరాలు భూములు కోల్పోగా దాదాపు 150 ఎకరాలు మాత్రమే కొందరి రైతుల భూమి మిగిలింది.ఈ భూములకు గతంలో కొర్రపాడు గ్రామంలో నుంచి దారి ఉండేది.ప్రస్తుతం మంగపట్నం రైల్వే స్టేషన్ సమీపం నుంచి పొలాలకు వెళుతున్నారు. గ్రావెల్ రోడ్డు లేక పోవడంతో వర్షం పడితే దారిలో పొలాలకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.150 ఎకరాల్లో రైతులు చీనీ, బొప్పాయి,ఉల్లి , ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని రైతులు వేడుకొంటున్నారు.



పొలాలకు వెళ్లలేని పరిస్థితి

భూములను గండికోట ప్రాజెక్టుకు త్యాగం చేశాం. ఉన్న భూముల్లో పంటసాగు చేసుకుంటున్నాం. వర్షం పడితే పొలాలకు వెళ్లలేకపోతున్నాం. కఽగ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసైనా ఆదుకోండి.

-మహేశ్వరరెడ్డి, రైతు, కొర్రపాడు

మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం మానుకోవాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటు పర్చ్న చేయాలనే ప్రయత్నాన్ని వెనక్కు తీసుకోవాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం ఆలోచన చేయడం దుర్మార్గపు నిర్ణయమన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు గజ్జెల లక్షుమయ్య, పట్టణాధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, దేవగుడి చంద్రశేఖ రొరెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొప్పర్తి ఆధ్వర్యంలో సీపీ ప్లస్ ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ వారు జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈజాబ్‌మేళాలో అందరూ పాల్గొనడం వారి భవిష్యత్తుపై ఉన్న నమ్మకం తెలుపుతుందన్నారు. మహిలలకు ఉచిత హాస్టలు, భోజన సౌకర్యాలు కల్పించడం, పురుషులకు అదనపు ఆర్థిక ప్రోత్సాహం ఇవ్వడం వల్ల గ్రామీణప్రాంత యువతకు ఉపాధి దొరికే అవకాశాలు మరింత పెరిగాయన్నారు. కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచ్ చిత్త రవిప్రకాశ్‌రెడ్డి, టేకూరుపేట సర్పంచ్ రమణారెడ్డి, రాజీవ్‌బాషా, చిత్త గిరిప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

సోలార్ కంపెనీలో చోరీ : ముగ్గురి అరెస్టు

కొండాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.కోడూరు వద్ద ఉన్న సోలార్ కంపెనీలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు తాళ్లప్రొద్దుటూరు ఏఎస్‌ఐ బాసు తెలిపారు. సోలార్ కంపెనీ వద్ద ఐదు సోలార్ పలకలు చోరీకి గురయ్యాయన్నారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందన్నారు. ఈ కేసులో శనివారం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఆయన తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. లిఫ్ట్ ఇరిగేషన్‌కు శాపం

● సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర ధ్వజం

కలసపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ అధికారుల నిర్లక్ష్యంతో తెల్లపాడు ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర విమర్శించారు. తెల్లపాడు సమీపంలో నిరుపయోగంగా మారిన ఎత్తిపోతల పథకాన్ని కార్యకర్తలతో కలిసి ఆయన సందర్శించారు. మండలంలోని మారుమూల గ్రామాలైన తెల్లపాడు, తంబళ్లపల్లె, రామాపురం పరిధిలోని తడుకుచెరువు, బాలవారిపల్లె చెరువు, తిక్కమ్మచెరువు, మేలకుంటచెరువు, కొత్తచెరువులకు నీటి ఎత్తిపోతలకోసం రూ.17కోట్లతో నిర్మించిన ఎత్తిపోతల పథకం అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారిందన్నారు. తక్షణమే రైతుల కోసం ఎత్తిపోతల ద్వారా చెరువులకు నీరందించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బద్వేలు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. శనివారం స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని పెన్షనర్స్ కార్యాలయంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపధ్యాయ అవార్డు గ్రహీత సగిలి బాలయ్య, కొడవటికంటి సుదర్శన్, జిల్లా ఉత్తమ అధికారిగా నాలుగు సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన ఎస్సీ కార్పొరేషను మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు వెంకటసుబ్బయ్యలను ఘనంగా సన్మానించారు. దేవానందం, జాకోబ్, ఓస్పోరి భాస్కర్, గురయ్య, జయచంద్రబాబు, తలారి రత్నం, రాజారావు, వడ్డెపోగు రవి, నాగిపోగుప్రసాద్ పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సందర్శించిన వైద్య బృందం

కలసపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని ఎస్సీబాలుర వసతిగృహాన్ని శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజలు సందర్శించారు. హాస్టల్ పరిసరాలు, వంటగది, వాష్‌రూం, తాగునీరు, నిద్రించే గదులు పరిశీలించారు. దోమలకోసం పడక గదుల వద్ద ఏర్పాటు చేసిన మెస్‌ల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించి, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డన్ బాలుడు, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, సీహెచ్‌ఓ వెంకటలక్షుమ్మ, ఏఎన్‌ఎమ్ లక్ష్మిదేవి, ఎంఎల్‌హెచ్‌పీ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఐక్యత హిందీదివస్

బి.కోడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సగిలేరు గురుకుల పాఠశాలలో శనివారం జాతీయ ఐక్యతను ప్రోత్సహిస్తున్న భాష హిందీ అని హిందీ దివస్‌ను ఘనంగానిర్వహించారు. కార్యక్రమంలో రచయిత హిందీ అధ్యాపకుడు బొల్లు రామ్మోహన్ మాట్లాడుతూ భారతదేశం విభిన్న భాషలకు నిలయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చెన్నయ్య, ఆదినారాయణ రెడ్డి, నరేంద్ర, సుభాష్, చిన్నయ్య, భరత్‌కుమార్‌రెడ్డి, గంగన్న, రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 134 కేసుల పరిష్కారం

● రూ. 4,74,76, 226 మొత్తం సెటిల్‌మెంట్


ఇన్సూరెన్సు క్లెయిమ్‌ను బాధితునికి అందజేస్తున్న జిల్లా అదనపు జడ్జి

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ప్రొద్దుటూరులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 134 కేసులు పరిష్కారమయ్యా యి. ఇందులో క్రిమినల్ కేసులు 98 కాగా సివిల్ కేసులు 36 ఉన్నాయి. శనివారం ప్రొద్దుటూరు జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. జిల్లా రెండవ అదనపు జడ్జి కె సత్యకుమారి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ ప్రతిభలు కలిసి మూడు బెంచీలుగా కేసులు విచారించారు. 134 కేసులకు సంబంధించి రూ.4,74,76,226 మొత్తం బాధితు లకు సెటిల్‌మెంట్ జరిగింది. ఇందులో యాక్సిడెంట్ కేసులో బాధితునికి రూ. 61 లక్ష లు ఇన్సూరెన్సు క్లయిమ్ చెక్కును జిల్లా రెండవ అదనపు జడ్జి సత్యకుమారి చేతుల మీదుగా అందజేశారు. శనివారం స్థానిక జిల్లా కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్‌లో చోళమండలం ఇన్సూరెన్సు కంపెనీతో బాధిత విద్యార్థి వద్ది సుమంత్ రాజీ పడటంతో ఈ కేసుకు సంబంధించి రూ. 61 లక్షల ఇన్సూరెన్సును అందజేశారు. వివరాల్లోకి వెళితే 2024 సెప్టెంబరు 5వ తేదిన ప్రొద్దుటూరు హనుమాన్ నగర్‌కు చెందిన వద్ది సుమంత్ (19) తన బాబాయ్‌తో కలిసి ఎర్రగుంట్లకు బైక్‌పై వెళ్లి వస్తుండగా పోట్ల దుర్తి వద్ద టిప్పరు అతివేగంగా వచ్చి బైక్‌ను గుద్దడంతో రెండు కాళ్లు పోయాయి. హైద రాబాదులో చికిత్సకు దాదాపు 36 లక్షలకు పైగా ఖర్చు అయ్యింది. బీటెక్ ఫస్ట్ ఇయర్ చదివే వద్ది సుమంత్‌కు లోక్ అదాలత్‌లో చోళమండలం ఇన్సూరెన్సు కంపెనీతో రాజీ కావడంతో అతనికి రూ. 61లక్షల నష్టపరిహారం అందజేశారు.

రాజీ మార్గమే.. రాజమార్గం

జమ్మలమడుగు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):కక్షిదారులు ఇష్టపూర్వకంగా వారివారి కేసులను సమస్యలు లేకుండా లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడం రాజమార్గమని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. శనివారం జమ్మలమడుగు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ జరిగింది. లోక్ అదాలత్‌లో పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లకు సంబంధించి కక్షిదారులు కేసుల పరిష్కారార్థం వచ్చి పరిష్కరించుకున్నట్లు తెలిపారు. సాయంత్రం 7 గంటల వరకు నిర్వహించారు. అందులో 4,493 కేసులు పరిష్కారం కాగా 50,81,123 రూపాయలు కేసుల ద్వారా పరిష్కారం అయినట్లు జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 1397 కేసులు పరిష్కారం


పరిష్కరించిన కేసులో అవార్డునందిస్తున్న జడ్జిలు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయలోక్ అదాలత్‌లో 1397 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. లోక్ అదాలత్‌లో రెండు బెంచ్‌లు ఏర్పాటు చేయగా సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ ఒక బెంచ్, రెండో బెంచ్ ప్రిన్సిపల్ జూని యర్ సివిల్ జడ్జి వై.సవిత ఆధ్వర్యంలో నిర్వహిం చారు. క్రిమినల్ కేసులు 1379, సివిల్ కేసులు 18, మొత్తం 1397 కేసులకు గాను రూ.59,68,587లకు పరిష్కారం జరిగినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం కళాశాల డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు ఫేర్‌వెల్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జీవీ రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, నైతికవిలువలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చదువులో యూనివర్సిటీ స్థాయిలో, క్రీడల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగభూషణ శర్మ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుందూ వరదను పరిశీలించిన రూరల్ సీఐ

రాజుపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): గత రెండురోజులుగా ఎగువ న కురుస్తున్న వర్షాలకు కుందూ ఉధృతంగా ప్రవహిస్తుంది. శనివారం రూరల్ సీఐ నాగభూషణం, ఎస్‌ఐ కత్తి వెంకటరమణ వెల్లాల వద్ద కుందూ నీటి ప్రవాహం పరిశీలించారు. శుక్రవారం రూ.30,200 క్యూసెక్కులు ప్రవాహం ఉండగా, శనివారం సాయం త్రం 28,950 క్యూసెక్కులు ప్రవాహం కొనసాగింది. ప్రస్తుతం వర్షాలు పడకపోవడంతో కుందూ ఉధృతి క్రమక్రమంగా తగ్గుతుంది. ఏదిఏమైనా బ్రిడ్జిపై రాకపోకలు నిషేధించారు.

పట్టణాభివృద్ధికి పాటుపడాలి

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష కోరారు. శనివారం ఇటీవల జరిగినమున్సిపల్ కౌన్సిల్ సమావేశంపై ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ ఉన్నప్పటికి కమిషనర్ సభ వెళ్లిపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. కౌన్సిల్ సమావేశానికి కోరం ఉన్నప్పుడు సభను నడిపే హక్కు పూర్తిగా చైర్‌పర్సన్‌కు ఉంటుందని స్పష్టం చేశారు.

సాగు, తాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

● సావిశెట్టిపల్లె వద్ద ఎత్తపోతల పథకం భూమిపూజలో రితేష్


ఎత్తిపోతల పథకానికి భూమిపూజలో పాల్గొన్న బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి

కాశినాయన సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): బద్వేల్ నియోజక వర్గంలో ప్రజలకు సాగు, తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి కె.రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సావిశెట్టిపల్లె సమీపంలో గల తెలుగంగ కాలువపై సావిశెట్టిపల్లె చెరువుకు నీరందించే ఎత్తిపోతల పథకానికి బీజేపీ నాయకుడు బొజ్జా రోశన్నతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమానికి వచ్చిన రితేష్‌రెడ్డికి మండల నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు రూ.35 కోట్లతో ఇటుకులపాడు, సావిశెట్టిపల్లె, కొండ్రాజుపల్లె తదితర చెరువులకు నీరందించే కార్యక్రమం చేపట్టామన్నారు. పండ్లతోటల సాగులో పులివెందుల తర్వాత కాశినాయన మండలమే జిల్లాలో పేరు గాంచిందన్నారు. కార్యక్రమంలో నర్సాపురం సొసైటీ చైర్మన్ బంగారు గుర్విరెడ్డి, బద్వేల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుప్రజ, టీడీపీ నాయకులు బసిరెడ్డి రవీంద్రారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ చిన్న ఖాజావలి, రవీంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చెన్నుపల్లె వెంకటరెడ్డి డీఈ శ్రీకాంత్‌రెడ్డి, డీటీ రవిశంకర్, ఎస్‌ఐ యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అవసరం ఎక్కువగా ఉంది

జమ్మలమడుగు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలో వరి సాగు చేసిన రైతులకు యూరియా అవసం ఎక్కువగా ఉందని వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎప్పుడో నెల రోజుల తర్వాత యూరియా అవసరం ఉన్న రైతులు వచ్చి ఆందోళన చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగులో వ్యవసాయాధికారి మాట్లాడుతూ .ఈఏడు మండంలో వరి పంటను 2,400 ఎకరాల్లో రైతులు సాగు చేశారన్నారు. జమ్మలమడుగు మండలానికి 578 మెట్రిక్ టన్నులు యూరియా రావడం జరిగిందన్నారు. కొంతమంది రైతులు మొదటిసారే ఎకరాకు 45 కిలోలు వాడుతున్నారని, సైంటిస్టులు మాత్రం ఎకరాకు 25 కిలోలు వాడాలని చెప్పారన్నారు. ఎక్కువగా వాడితే చీడపీడలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు.

ఘనంగా గొడుగుల మహోత్సవం

మైలవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపరాల గ్రామంలో గొడుగుల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక వారి సౌజన్యంతో నాటక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కళాకారులను సన్మానించారు.